మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

8.7.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 72 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


## 76కే భారత్ ఆలౌట్



# కేరళంలో భారీ వర్షాలు



- వర్షాలకు వయనాడ్ అతలాకుతలం
- కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి
- మట్టి దిబ్బల కింద పలువురిని కాపాడిన సిబ్బంది
- సహాయక చర్యలకు అడ్డంకిగా మారిన వాతావరణం
- వర్షాలపై సీఎం సతీశన్ అత్యవసర భేటీ.. వయనాడ్‌కు ఇద్దరు మంత్రులు

కేరళంలో కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో ప్రమాదానికి దారితీశాయి. మంగళవారం మెప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం వద్ద భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. భారీ వర్షాలకు వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి.

04




## గుజరాత్ హైకోర్టు
# సంచలన తీర్పు

- 2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి
- మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు

04

# కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

## కేసీఆర్ సరేనంటే.. ఎంత సమయమైనా కేటాయిస్తాం

- కేసీఆర్ వాదన సరైనదయితే.. ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం
- కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్ట్ అన్న సీఎం రేవంత్ రెడ్డి
- నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు
- కేటీఆర్, హరీష్ రావులు ఆర్థిక ఉగ్రవాదులని విమర్శలు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్ విమర్శలు

**జనతా న్యూస్, హైదరాబాద్,జూలై7 :** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్ట్‌ను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు

మిగతా 2 లో



ప్రజలకు మెరుగైన
# సేవలను అందించడమే లక్ష్యం

- రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు
- పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్
- సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేందుకు ఉపయుక్తం
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

02

## తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, పిల్లలదే కీలక పాత్ర

- మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని
- గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం
- నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభంలో సీఎం రేవంత్



# ఇరుదేశాల మధ్య బలమైన సహకారం

## రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేషియా బంధం

- పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని మోడీ
- మోడీ పథకాలు కాపీకొట్టామన్న అధ్యక్షుడు
- మిత్రలు మధ్య కాపీరైట్ ఉండదంటూ మోడీ చమత్కారం

రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు.

04

ప్రధాని మోడీకి
## అరుదైన గౌరవం
ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు



- 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం
- సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు.

03



03

ఆయిల్‌పామ్‌కు చిరునామాగా
# తెలంగాణను మారుస్తాం

- బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే మరింత ప్రోత్సాహం..
- రైతులకు మలేషియా పర్యటనలు ఏర్పాటుచేస్తాం
- తెలంగాణను ఆయిల్‌పామ్ రాష్ట్రంగా మారుస్తాం
- రాష్ట్రంలోని ఆయిల్‌పామ్ రైతులకు కేటీఆర్ భరోసా
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రైతులతో భేటీ

# కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

- నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు
- మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏంటి
- సిఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.

02





# కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

## నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు

## మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏంటి

## సిఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్,జూలై7 :** స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను , నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయాన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

# ధరణి పోర్టల్‌తో భూ అక్రమాలు

## సమగ్ర దర్యాప్తు దిశగా ప్రభుత్వం చర్యలు.. సిట్ వేసే యోచనలో ప్రభుత్వం

**హైదరాబాద్,జూలై7 :** ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం విజిలెన్స్ విభాగం ద్వారా లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వెలుగులోకి వస్తున్న అక్రమాలపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. భద్రతా వ్యవస్థలను బైపాస్ చేస్తూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి లావాదేవీలు నిర్వహించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. అంతేకాకుండా విదేశాల్లో ఉన్న భూ యజమానులకు తెలియకుండానే వారి పేర్లలో మార్పులు చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించనున్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో జరిగిన సుమారు రూ.8 లక్షల లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ పక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ పరిశీలనలో దాదాపు 22 వేల రిజిస్ట్రేషన్లలో తేడాలు ఉన్నట్లు సమాచారం. అలాగే 'ఘోస్ట్ ఐడీలు' ఉపయోగించి లక్షల ఎకరాల భూ రికార్డులను మార్చినట్లు ఆరోపణలు రావడం మరింత సంచలనంగా మారింది. కొందరు సిస్టమ్‌లోని టైమ్ క్లాక్‌ను మార్చి పాత తేదీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సంస్థ నిర్వహించిన పరిశీలనలో ఈ అంశాలు బయటపడినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవడం, భూ రికార్డుల భద్రతను మరింత బలోపేతం చేయడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వం చేపట్టబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

## సిఇవోకు ఫిర్యాదు చేసిన బిజెపి నేతలు

**హైదరాబాద్,జూలై7 :** సర్ పక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ ఖీ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్‌ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# రిటైర్డ్ టీచర్ ఆత్మహత్య

## 33 పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం

**జనగామ,జూలై7 :** జిల్లాలో రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. జనగామ పట్టణంలోని పూర్ణిమ కాలనీకి చెందిన పగిడిపల్లి మల్లయ్య అనే రిటైర్డ్ టీచర్ ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. చనిపోయే ముందు తన చావుకు కారణమైన వారి పేర్లతో మల్లయ్య సూసైడ్ నోట్ రాశారు. మొత్తం 33 పేజీల సూసైడ్ నోట్‌ను రాసి చనిపోయారు. రిటైర్డ్ టీచర్ రాసిన నోట్‌లో బావమర్దులు గుంటి రత్నాకర్, మనోహర్ పేర్లు ఉన్నాయి. వీరిద్దరి వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మల్లయ్య లెటర్‌లో రాశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు

నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు మల్లయ్య రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల విచారణ కొనసాగనుంది. మల్లయ్య మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

మొదటి పేజీ తరువాయి

ఆ కాంట్రాక్ట్ ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతున్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరుపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,



దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్ధాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్ధాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు. అబద్ధాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని రేవంత్ చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖాతాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, పిల్లలదే కీలక పాత్ర

## మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని

## గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం

## నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,జూలై7 :** తెలంగాణ సమాజ అభివృద్ధిలో మహిళలు, పిల్లల పాత్రే అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నాచారంలో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ స్కూళ్లలోనే టీచర్లు కూడా బ్రేక్‌ఫాస్ట్, లంచ్ చేయాలని సీఎం నిర్ణయించారు. ఇక్కడ తయారు చేసే బాలమృతం ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే విధంగా ప్లాంట్ రూపొందిందని అన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్లపాటు బాలామృతం పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా ఈ ఎ÷-లాంట్ అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లలకు ఓట్లు లేకపోయినా.. వారి భవిష్యత్ పట్ల తమ ప్రభుత్వానికి శ్రద్ధ ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళల సంక్షేమంపై మాట్లాడుతూ.. ప్రజా పాలన వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, దీనివల్ల పనిచేసే మహిళలకు నెలకు 10 వేల వరకు ఆదా అవుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరు మీదే ఇస్తున్నామని.. త్వరలోనే హైదరాబాద్ సిటీలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు పంచుతామని సీఎం భరోసా ఇచ్చారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపోతే రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాచారంలో రూ.40 కోట్లతో నిర్మించిన బాలామృతం తయారీ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. తయారీ వివరాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ద్వారా గంటకు 18 టన్నుల బాలామృతం తయారు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. మరోవైపు త్వరలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తామని సీఎం చెప్పారు. 'ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 4.5లక్షల ఇళ్లు కట్టాం. పట్టణాల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. విద్యార్థుల కోసం ఏటా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాజకీయాలకతీతంగా ఉప్పల్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటా అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

## రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు

## పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్

## సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఉపయుక్తం

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు

## ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్,జూలై7 : పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్‌ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మానేరు
జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 8 జూలై 2026


# ఆయిల్‌పామ్‌కు చిరునామాగా తెలంగాణను మారుస్తం

బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే మరింత ప్రోత్సాహం..

రైతులకు మలేషియా పర్యటనలు ఏర్పాటుచేస్తాం

తెలంగాణను ఆయిల్‌పామ్ రాష్ట్రంగా మారుస్తాం

రాష్ట్రంలోని ఆయిల్‌పామ్ రైతులకు కేటీఆర్ భరోసా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రైతులతో భేటీ



**హైదరాబాద్, జూలై 7 :** '2028లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, ఆ తర్వాత తెలంగాణను దేశంలోనే అత్యధిక ఆయిల్‌పామ్ సాగుచేసే రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం' అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు స్పష్టంచేశారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తామని, ఆయిల్‌పామ్ రాష్ట్రంగా తెలంగాణను మారుస్తామని తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం పర్యటించిన కేటీఆర్.. అకడ ఆయిల్‌పామ్ రైతులతో సుదీర్ఘంగా సమావేశమై ముచ్చటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితాలను సమీక్షించడంతోపాటు ప్రస్తుతం రైతులు ఎదురొంటున్న సమస్యలు, అనుభవాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకొన్న ఆయన మంగళవారం ఒక ప్రకటనలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ అంశాలను విడుదల చేశారు.

తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలన్నది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో రూపొందించిన లక్ష్యమని కేటీఆర్ గుర్తుచేశారు. మలేషియా, ఇండోనేషియా దేశాల తరహాలో ఇకడ కూడా సాగును అభివృద్ధి చేసి, వంటనూనెల దిగుమతులపై దేశం ఆధారపడే పరిస్థితిని తగ్గించాలనేదే తమ సంకల్పమని చెప్పారు. వరి వంటి సంప్రదాయ పంటలతో పోలిస్తే రైతులకు మూడు రెట్లు అధిక ఆదాయం అందించడమే లక్ష్యంగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షన్నర ఎకరాలుగా ఉన్న ఆయిల్ పామ్ సాగు, ప్రస్తుతం దాదాపు మూడు లక్షల ఎకరాలకు చేరిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తే అది 7 లక్షల ఎకరాలకు చేరుకొనే అవకాశం ఉన్నదని పేరొన్నారు.

### ఐటీ ఉద్యోగంలా స్థిరమైన ఆదాయం

కేటీఆర్‌తో సమావేశమైన రైతుల్లో పలువురు తమ అనుభవాలను పంచుకున్నారు. 'నేను ఏడెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నా. నాలుగేండ్ల తర్వాత దిగుబడి ప్రారంభమై ప్రస్తుతం ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు వస్తున్నది. ఐటీ ఉద్యోగంలో నెలవారీగా జీతం వచ్చినట్టే ఈ పంట ద్వారా ప్రతినెలా స్థిరమైన ఆదాయం వస్తున్నది' అని హెచ్‌సీఎల్ సంస్థలో వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్న ఐటీ ఉద్యోగి అనిల్ సంతోషం వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులను తట్టుకోవడంతోపాటు వరి కంటే తకువ నీటితోనే ఈ సాగు సాధ్యమవుతున్నదని తోటి రైతులు చెప్పారు. కూలీల కొరత వల్ల యాంత్రీకరణకు మద్దతివ్వాలని, మొకలు ఎదిగిన తర్వాత రెండో దశ డ్రిప్ లైన్లకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. విదేశీ పామాయిల్ దిగుమతుల వల్ల దేశీయ రైతులు నష్టపోకుండా కేంద్రం యాంటీ డంపింగ్ విధానాన్ని అమలు చేసేలా ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు.

### కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించాలి

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించి, నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపి రైతుల పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని సమర్థవంతంగా వినియోగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, లక్షలాది క్యూసెకుల నీటిని సముద్రంలోకి వదిలేస్తూ ఇక్కడి రైతుల పంటలను ఎండబెడుతున్నారని మండిపడ్డారు. ఇంట్లో ఒక చోట చిన్న లీకేజీ వచ్చిందని మొత్తం ఇంటినే కూల్చేస్తారా? అని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీలోని చిన్న భాగంలో సమస్య వస్తే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టునే పకన పెట్టడం రైతుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతమని మండిపడ్డారు.

### బీఆర్ఎస్ రాగానే మలేషియాకు రైతులు

తాము అధికారంలోకి రాగానే ఆయిల్‌పామ్ సాగుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రపంచస్థాయి ఆధునిక సాగు పద్ధతులు, యాంత్రీకరణ, నీటి వినియోగ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వీలుగా ఇక్కడి రైతులకు మలేషియాకు ప్రత్యేక అధ్యయన పర్యటనలకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ట్రాక్టర్లు, స్లాషర్లు వంటి వ్యవసాయ యంత్రాలపై అధిక సబ్సిడీలు ఇస్తామని, రెండోదశ డ్రిప్ ఇరిగేషన్ లైన్ల ఏర్పాటుకు ప్రత్యేక సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. రైతు సంక్షేమమే కేసీఆర్ జీవిత లక్ష్యమని, పంటల వైవిధ్యీకరణలో తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

## హ్యామ్ రోడ్ల నిర్మాణంతో మారనున్న రూపురేఖలు

గతంలో ఎప్పుడూ లేనంతగా రోడ్ల నిర్మాణాలు

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం

రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూలై7 :** తెలంగాణ రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌ను గతంలో ఎప్పుడూ లేనంతగా అత్యద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఇటీవల సిఎం హ్యా రోడ్లకు శంకుస్థాపన చేయడంతో రాష్టర రోడ్ల స్వరూపం మారబోతోందని అన్నారు. ఈ ప్రాంత ప్రజలతో తనకు ప్రత్యేకమైన, వెలకట్టలేని అనుబంధం ఉందని.. గతంలో ప్రజలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని మరి తనను ఎంపీగా గెలిపించారని ఆయన కృతజ్ఞతతో గుర్తుచేసుకు న్నారు. ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందుకే రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్రీకారం చుట్టామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల రూపురేఖల ను మార్చేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వెళ్తోందని మంత్రి వివరించారు. మొత్తం రూ. 13,000 కోట్ల భారీ వ్యయంతో, 34 ప్యాకేజీల కింద, 6,092 కిలోమీటర్ల మేర విస్తరించిన 441 రోడ్లను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నల్లగొండ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రమాదాలు లేని క్వాలిటీ రోడ్లుగా వీటిని తీర్చిదిద్దుతామని, రోడ్లు రద్దీగా ఉండే హైదరాబాద్ రూరల్ సర్కిల్ 1 / 2 ప్యాకేజీల్లోనే దాదాపు 30 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తాజాగా రూ. 338 కోట్ల వ్యయంతో 149 కిలోమీటర్ల మేర విస్తరించే 14 రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో నాలుగు లేన్ల (4-ఒజీని) రహదారుల నిర్మాణం ఒక చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా, ఈ ప్రాంత ప్రజల మనిషిగా అద్దం లాంటి రహదారులను నిర్మించి తీరుతామని.. ఈ రోడ్ల కనెక్టివిటీ ద్వారా రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయని మంత్రి వెంకట్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

## పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్

**న్యూఢిల్లీ,జూలై7 :** పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## గురుకులాల్లో పరిశుభ్రతకు పెద్దపీట

మెనూ ప్రకారం ఆహార సరఫరా.. అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం



**హైదరాబాద్,జూలై7 :** గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం ఆయా శాఖల ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమంపై డీబీసీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర రాష్ట్రాల స్టడీ సర్కిల్స్ విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు సమాన అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. ఐటీ, ఐఐఎం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీపై ఈ సందర్భంగా అధికారుల నుంచి మంత్రి నివేదిక కోరారు. గురుకులాలు, హాస్టళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు. కుట్టు మిషన్ పథకం అమలుకు సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల కిట్ల పంపిణీ వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## తాడిచర్లతో మరో 40 ఏళ్లపాటు ఢోకా లేదు

కేంద్రానికి కృతజ్ఞతలు

తెలిపిన డిప్యూటి సిఎం భట్టి

**హైదరాబాద్,జూలై7 :** సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం కృషి ఫలించిందని అన్నారు. మరో 40 ఏళ్ల పాటు మైనింగ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. 340 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు అవకాశం కలిగిందని చెప్పారు. తాడిచర్ల-2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. బ్లాక్‌లో జీ-9 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు లభ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి భారీ ఊతం లభించినట్లు అయిందని అన్నారు. దీంతో రైలు, రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశ్రామిక రంగాలకు దీర్ఘకాలిక బొగ్గు భద్రత ఉంటుందని చెప్పారు. సింగరేణి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఇది బలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర బొగ్గు బ్లాకులు కూడా సింగరేణికే ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

## హిమాన్షు ముక్కుకు గాయం

ఆస్పత్రికి వచ్చిన కెటిఆర్, కెసిఆర్



**హైదరాబాద్,జూలై7 :** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ తనయుడు హిమాన్షుకు స్వల్ప గాయమైంది. నిన్న ఆటలాడుతుండగా అతడి ముక్కుకు గాయమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే ఆస్పత్రికి చేరుకోగా.. సిద్దిపేటలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయల్దేరి కేసీఆర్ కూడా ఆస్పత్రికి వెళ్లారు. మనవడిని పరామర్శించి.. అతడి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు తాను కోలుకుంటున్నట్లు హిమాన్షు ఎక్స్ వేదికగా వెల్లడించారు. చిన్నపాటి గాయమవ్వడంతో గత రాత్రి ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత విశాంత్రి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు హిమాన్షు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదిగా స్పందించారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని, ప్రస్తుతం చికిత్స కొనసాగుతున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటాడని అన్నారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మృతి

సంతాపం తెలిపన కెసిఆర్

**హైదరాబాద్,జూలై7 :** తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో నిరాడంబరత, నీతి నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ప్రజల మనిషి నర్సింహా రెడ్డి అని, వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. భూదానోద్యమంలో తను వందలాది ఎకరాలను పేదలకు పంచిన నర్సింహా రెడ్డి, 1969లో తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాల్గొని, మూసీ పరిరక్షణ, తెలంగాణకు గోదావరి నదీ జలాల కోసం కృషి చేశారని తెలిపారు. శోక తప్తులైన కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం

సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై7 :** తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాము లయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వు ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వు ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య

భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు

గుట్టురట్టు చేసిన మియాపూర్ పోలీసులు

మహారాష్ట్ర సరిహద్దులో శవాన్ని పూడ్చిపెట్టినట్లు గుర్తింపు

**హైదరాబాద్,జూలై7 :** ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య, ఏమీ తెలియదన్నట్లుగా మిస్సింగ్ కేసు పెట్టింది. భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నగరంలోని మియాపూర్‌లో ఈ దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య అత్యంత కిరాతంగా హత్య చేసింది. ఆ తరువాత భర్త కనిపించడం లేదంటూ గతేడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా అసలు నిజాలు బయటకు వచ్చాయి. ఏడు నెలల తర్వాత ఈ కేసులో భార్యే హంతకురాలిగా పోలీసులు తేల్చారు. భర్తను భార్యే హత్య చేసి ఆపై కనిపించడం లేదంటూ నాటకం ఆడినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా భార్య కాల్ రికార్డ్స్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. భర్తను చంపి మృతదేహాన్ని మహారాష్ట్ర బోర్డర్ వరకు తరలించి పూడ్చిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు పెంటేష్(45)గా గుర్తించారు. తన ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో వెంకటేష్‌ను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో భార్య అంగీకరించింది. ప్రస్తుతం నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె ప్రియుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రియుడి కోసం కట్టుకున్న భర్తను భార్య హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# ఇరుదేశాల మధ్య బలమైన సహకారం

**రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేషియా బంధం**

**పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని మోడీ**

**మోడీ పథకాలు కాపీకొట్టామన్న అధ్యక్షుడు**

**మిత్రులు మధ్య కాపీరైట్ ఉండదంటూ మోడీ చమత్కారం**



**న్యూఢిల్లీ :** రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో అంతకుముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ.. స్నేహితుల మధ్య 'కాపీరైట్‌లు' ఉండవని నవ్వుతూ వ్యాఖ్యానించారు. జకార్తాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రబోవో మంగళవారం ఉదయం మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఎన్నో ఏళ్లుగా మోదీని నిశితంగా గమనిస్తున్నానని.. ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు, పథకాలను కాపీ కొట్టానని అన్నారు. రెండు దేశాల్లో జనాభా ఎక్కువ ఉండడం, ప్రకృతి విపత్తులు వంటి సమస్యల నేపథ్యంలో వాటిని అధిగమించడానికి భారత్ అనుసరించే పద్ధతులను తాము కూడా పాటిస్తామన్నారు. మోదీ చేపట్టే కార్యక్రమాలలో దేనిపైనా కాపీరైట్ లేకపోవడం సంతోషంగా ఉందంటూ చిరునవ్వులు చిందించారు. ప్రధాని మోదీ ఇండోనేసియాలో పర్యటిస్తున్న క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. ఆ దేశంలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు ప్రధాని మోదీ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

## ప్రధాని మోడీకి అరుదైన గౌరవం

**ఇండోనేషియా అత్యున్నత పురస్కారం**

**న్యూఢిల్లీ :** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా దేశం తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా'అవార్డును ప్రధాని మోదీకి ప్రకటించింది. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఇండోనేసియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఈ అత్యున్నత పురస్కారాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత్-ఇండోనేసియా దేశాల మధ్య చారిత్రక బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చడంలో ప్రధాని మోదీ పోషించిన పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) ప్రయోజనాల కోసం, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల కోసం భారత్ అందిస్తున్న సహకారం అమోఘమైనదని ఆయన ప్రశంసించారు.

## హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తత

**రెండు నౌకలపై ఇరాన్ మిస్సైల్ దాడి**

**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసింది. రెండు నౌకలపై మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో రెండు నౌకలు దెబ్బ తిన్నాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ విషయాన్ని అమెరికా అధికారులు మీడియాకు వెల్లడించారు. కాగా, మూడు వారాల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు మెమొరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిలో దాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో ఘటనలో.. ఒమన్‌లోని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. దీని కారణంగా ఆ నౌక ఎడమ వైపు భాగంలో భారీగా మంటలు చెలరేగాయి. బ్రిటీష్ మిలిటరీకి చెందిన 'యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్' ఈ ప్రమాదాన్ని అధికారికంగా ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది.

## అయోధ్య చోరీలో కీలక ఆధారలు సేకరణ

**కరెన్సీని జేబులు, బూట్లల్లో దాచుకుని తరలింపు**

**70సార్లు దొంగతనం.. చూసీచూడనట్లుగా అధికారులు**

**సిసి టివి ఫుటేజ్ ఆధారాలను సుకరించిన సిట్**

**అయోధ్య :** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక ఆధారాలను సేకరించినట్లు సిట్ వెల్లడించింది. ఈ విషయంపై యూపీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు విరాళాల లెక్కింపు చేపట్టిన వ్యక్తుల్లో కొందరు డబ్బులు అపహరించినట్లు సీసీటీవీ దృశ్యాల్లో తేలిందని పేర్కొంది. ఈ 39 రోజుల్లో లెక్కించే సమయంలో కొంతమంది సిబ్బంది కరెన్సీ నోట్ల కట్టలను, చిల్లరను తమ దుస్తులు, జేబులు, బూట్లలో దాచిపెట్టినట్లు సీసీటీవీ రికార్డుల్లో కనిపించిందని తెలిపింది. డబ్బును సిబ్బంది దొంగలిస్తున్నట్లు చూసిన కొందరు అధికారులు కూడా వారిని ఆపడానికి ప్రయత్నించలేదని సిట్ పేర్కొంది. నిందితులు దాదాపు 70 సార్లు దొంగతనాలకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, లెక్కింపు సిబ్బందిని విచారించామన్నారు. వారి వాంగ్మూలాల ప్రకారం ఏప్రిల్ 27కి ముందు కూడా విరాళాల చోరీ జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంలో ఆధారాలు సేకరించడం సవాలుగా మారిందన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ఐదేళ్ల ఖాతాలను రీఆడిట్ చేస్తున్నామని.. బ్యాంకు రికార్డులు, విరాళాల పత్రాలు, ఆలయ నిర్మాణ వ్యయాలు, బంగారం, వెండి వస్తువులతో సహా అన్ని ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆలయంలో భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ పరికరాలపై పరిమితులు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి చర్యల్లో అనేక లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లోపాలను వినియోగించుకుని నిందితులు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. విలువైన కానుకల నిర్వహణ, డాక్యుమెంటేషన్, తూకం వేయడం వంటి వాటిల్లోనూ పలు విధానపరమైన లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెలిష్ పాండే, రామశంకర్ మిశ్రాలకు ప్రమేయం ఉన్నట్లు నిర్ధరించారు. సీసీటీవీ దృశ్యాల్లో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్‌లు పలుమార్లు నగదు, నగలను అపహరిస్తున్నట్లు రికార్డ్ అయ్యిందని పేర్కొన్నారు.

# కేరళంలో భారీ వర్షాలు

**వర్షాలకు వయనాడ్ అతలాకుతలం**

**కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి**

**మట్టి దిబ్బల కింద పలువురిని కాపాడిన సిబ్బంది**

**సహాయక చర్యలకు అడ్డంకిగా మారిన వాతావరణం**

**వర్షాలపై సిఎం సతీశన్ అత్యవసర భేటీ..వయనాడ్‌కు ఇద్దరు మంత్రులు**



**తిరువనంతపురం,జూలై 7 :** కేరళంలో కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో ప్రమాదానికి దారితీశాయి. మంగళవారం మెప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం వద్ద భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. భారీ వర్షాలకు వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, మట్టి కింద కూరుకుపోయిన ఆరుగురిని స్థానికులు రక్షించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొంతమంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మలప్పురం, వయనాడ్ జిల్లాలను కలిపే సొరంగ మార్గం నిర్మాణ పనులు జరుగుతున్న మీనాక్షి వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి వయనాడ్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారీగా మట్టి, బండరాళ్లు ఒక్కసారిగా కొండపై నుంచి కూలిపడి నిర్మాణ ప్రాంతాన్ని పూర్తిగా కప్పివేశాయి. ప్రమాదం సంభవించగానే అక్కడ ఉన్న కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కనీసం ఐదుగురు గాయపడగా, మరికొందరు మట్టిలో చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు కలిసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు ఈ ప్రమాదంపై కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీషన్ వెంటనే జిల్లా మంత్రులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక, పునరావాస చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. వయనాడ్‌కు వెళ్లి సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు అగ్నిమాపక, పోలీసు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దింపి సహాయక చర్యలు చేపట్టారు. యనాడ్‌లో సోమవారం నుంచి భారీ వర్షాలు పడుతుండగా సొరంగం పనులను అదే రోజు నుంచి ప్రాజెక్టు అధికారులు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సొరంగ మార్గం ప్రాజెక్టు కోసం పని చేసే కార్మికులు నివసించే వసతి గృహంపై కొండచరియలు పడ్డాయి. అలాగే, కొన్ని నివాస గృహాలు, హోమ్‌స్టేలపైనా భారీగా మట్టి, రాళ్లు వచ్చిపడ్డాయి. దీంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. మరోవైపు శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు, స్థానికులు ఉండొచ్చని సహాయక చర్యలు చేపట్టిన అధికారులు భావిస్తున్నారు. అనేక వాహనాలు, ఇళ్లు దెబ్బతినగా.. నష్టాన్ని అధికారులు ఇంకా అంచనా వేయలేదు.

శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కొండచరియల కింద చిక్కుకున్న కొంతమంది కార్మికులను సహాయక సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా

వీటికి ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో దాదాపు 100 మంది నివసిస్తున్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొండచరియల కారణంగా మలప్పురం - వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు, మీనాక్షి వంతెన వద్ద నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వయనాడ్‌లో 2024లోనూ కొండచరియలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. నాడు ముండక్కై, చూర్‌మాలా ప్రాంతాల్లో బండరాళ్లు విరిగిపడి 298 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. భారీ వర్షాల కారణంగా రెస్క్యూ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. భారత వాతావరణ శాఖ కేరళంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది. కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.

## కాశ్మీర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

**దోడా జిల్లాలో ఆకస్మిక వరదలు.. విరిగిపడ్డ కొండచరియచలు**

**శ్రీనగర్ :** భారీ వర్షాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. దోడా జిల్లాలో మంగళవారం ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద, బండరాళ్లు కొట్టుకురావడంతో తాత్రి పట్టణంలో పలువురి ఇళ్లు, దుకాణాలు, వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాణనష్టం ఏమీ జరగలేదని అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా దోడా, కిష్త్వార్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు రావడం ఇది మూడోసారి. మంగళవారం సంభవించిన వరదలకు తాత్రి పట్టణంలో రోడ్డుపక్కన నిలిపిన అనేక వాహనాలు మట్టిలో కూరుకుపోగా, కొన్ని చీనాబ్ నదిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదల కారణంగా దోడా-కిష్త్వార్ జాతీయ రహదారి తాత్రి వద్ద మూసుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రహదారిని పునరుద్ధరించే పనులను అధికారులు చేపట్టారు. వదంతులు నమ్మవద్దని, ప్రజలు అధికారిక సమాచారం కోసం కంట్రోల్ రూం లేదా జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని డిప్యూటీ కమిషనర్ కృష్ణన్ లాల్ సూచించారు.

## గుజరాత్‌లో భారీ వర్షాలు

**అహ్మదాబాద్ :** భారీ వర్షాలకు గుజరాత్‌లోని నీటి పారుదల ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. జోరువానలు గుజరాత్ అంతటా విస్తారంగా కురుస్తున్నాయి. దీంతె వాగులు వంకలు పొంగుతున్నాయి. భావ్‌నగర్ జిల్లా పాలితానాలోని శెత్రుంజీ డ్యామ్‌కు వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో జలాశయం 59 గేట్లను ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తున్న దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి.

## ముంబైని ముంచెత్తిన జోరువాన

**మహారాష్ట్రలో పలు ప్రాంతాల్లో 600మిమి వర్షపాతం**

**ముంబై వీధులన్నీ జలమయం..బయటకు రావద్దని హెచ్చరిక**

ముంబై,జూలై7(ఆర్ఎన్ఎ): దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంబైలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైలు సేవలు చాలా వరకు నిలిచిపోయాయి. కొన్ని విమాన సర్వీసులు రద్దు కాగా, వందలాది విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో 600 మిలీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో ముంబై-పుణె మార్గంలోని కర్జత్-లోనావాలా ఘాట్ రోడ్డులో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ రూట్‌లో రెండ్రోజులుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక, పుణె జిల్లాలోని ప్రముఖ హిల్ స్టేషన్ అయిన లోనవాలాలో గత 24 గంటల వ్యవధిలో 670 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ముంబై, థానే, పుణె, పాల్ఘర్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఐఎండీ తాజా అంచనాల ప్రకారం, మహారాష్ట్రలోని కోంకణ్ ప్రాంతంతో పాటు పశ్చిమ కనుమల పరిసరాల్లో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇక, ముంబైలో మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటికే ముంబై నగరం జలమయంగా మారింది. దీంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు అధికారులు సూచించారు.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**అహ్మదాబాద్ :** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# 76కే భారత్ ఆలౌట్




## 125 రన్స్‌తో ఓడిన శ్రేయాస్ సేన

## ఇంగ్లండ్‌దే మూడో టీ20

నాటింగ్‌హామ్: టీ20 వరల్డ్ చాంపియన్ భారత్ ప్రదర్శన మ్యాచ్ మ్యాచ్‌కూ మరింత తీసికట్టుగా మారుతోంది. ఇప్పటికే పసికూన ఐర్లాండ్ చేతిలో సిరీస్ కోల్పోగా.. ఇంగ్లండ్ చేతిలో వరుసగా రెండో ఓటమిని ఎదుర్కొంది. 202 పరుగుల ఛేదనలో పేసర్లు జోష్ టంగ్ (4/28), ఆర్చర్ (3/29) పదునైన బంతుల ధాటికి మన బ్యాటర్లు కనీసం వంద పరుగులు కూడా చేయలేక చతికిలపడ్డారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో తమ టీ20 చరిత్రలోనే అతి పెద్ద ఓటమిని (125 పరుగుల తేడా) చవిచూడాల్సి వచ్చింది. అటు సిరీస్‌లో ఆతిథ్య జట్టు 2-0తో ఆధిక్యం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 201/7 స్కోరు సాధించింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70), జోస్ బట్లర్ (21 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 36), సామ్ కర్రాన్ (24 బంతుల్లో 4 ఫోర్లతో 41 నాటౌట్) రాణించారు. పేసర్లు ప్రిన్స్, హర్షిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 11.4 ఓవర్లలో 76 పరుగులకే కుప్పకూలింది. వైభవ్ (13), ఇషాన్ (13) టాప్ స్కోరర్లు. రషీద్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఆర్చర్ నిలిచాడు.

### వికెట్లు టపటపా:

భారీ ఛేదనలో భారత్ ఏ దశలోనూ పోరాడలేకపోయింది. పేసర్లు ఆర్చర్, టంగ్‌ల ధాటికి బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. ప్రతీ బ్యాటర్ హిట్టింగ్ కోసం వెళ్లి వికెట్లను చేజార్చుకున్నారు. పవర్‌ప్లే ముగిసేలోపే అభిషేక్ (10), వైభవ్, ఇషాన్, శ్రేయాస్ (5), అక్షర్ (10) వికెట్లను కోల్పోయిన భారత జట్టు 52/5 స్కోరుతో దీనంగా కనిపించింది. ఆ తర్వాత కూడా వికెట్ల పతనం ఆగలేదు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు చేరడంతో టీమిండియా కనీసం వంద పరుగులు కూడా చేయలేకపోయింది.

### ముందు బట్లర్.. ఆ తర్వాత సాల్ట్:

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ఫిల్ సాల్ట్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. అయితే ఆరంభంలో మాత్రం మరో ఓపెనర్ జోస్ బట్లర్ హవా సాగింది. చివర్లో సామ్ కర్రాన్ అండగా నిలిచి స్కోరు 200 దాటించాడు. పేసర్ అర్ష్‌దీప్ తొలి ఓవర్‌నే మెయిడిన్‌గా వేసినా.. అటు బట్లర్ మాత్రం బౌండరీలతో జోరు చూపాడు. అయితే అతడి ధాటికి ఆరో ఓవర్‌లో పేసర్ ప్రిన్స్ బ్రేక్ వేశాడు. దీంతో తొలి వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే కెప్టెన్ బ్రూక్ (16)ను సైతం తనే అవుట్ చేయడంతో ఇంగ్లండ్ తడబడినట్టు కనిపించింది. ఈదశలో సాల్ట్ బ్యాట్‌కు పనిచెబుతూ స్పిన్నర్ వరుణ్ ఓవర్‌లో 6,4,4తో 18 రన్స్ రాబట్టాడు. అయితే 12వ ఓవర్‌లో పేసర్ హర్షిత్ వరుస బంతుల్లో బెథెల్ (13), బాన్‌టన్ (0)లను అవుట్ చేయడంతో ఇంగ్లండ్ 111/4 స్కోరుతో నిలిచింది. అటు 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న సాల్ట్.. అర్ష్‌దీప్ ఓవర్‌లో 6,4తో మరింత వేగం పెంచాడు. అతను మరింత ప్రమాదకరంగా మారకముందే 17వ ఓవర్‌లో స్పిన్నర్ అక్షర్ అవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ అదే ఓవర్‌లో జాక్స్ (14) రెండు సిక్సర్లతో వేగం తగ్గకుండా చూశాడు. మరో వైపు కర్రాన్ అడపాదడపా బౌండరీలతో ఆకట్టుకున్నాడు. ఆరో వికెట్‌కు ఈ ఇద్దరు 35 పరుగులు జోడించారు. చివరి ఓవర్‌లో అర్ష్‌దీప్ 9 పరుగులే ఇచ్చినా జట్టు స్కోరు 200 దాటింది.

### స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) అర్ష్‌దీప్ (బి) అక్షర్ 70, బట్లర్ (బి) ప్రిన్స్ యాదవ్ 36, బ్రూక్ (సి) అభిషేక్ (బి) ప్రిన్స్ యాదవ్ 16, బెథెల్ (సి) వైభవ్ (బి) హర్షిత్ 13, బాంటన్ (సి) వరుణ్ (బి) హర్షిత్ 0, సామ్ కర్రాన్ (నాటౌట్) 41, విల్ జాక్స్ (రనౌట్) 14, ఆర్చర్ (రనౌట్) 5, డాసన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 201/7; వికెట్ల పతనం: 1-43, 2-71, 3-111, 4-111, 5-158, 6-193, 7-199; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-1-36-0, హర్షిత్ రాణా 4-0-40-2, అక్షర్ పటేల్ 4-0-49-1, ప్రిన్స్ యాదవ్ 4-0-30-2, శివమ్ దూబే 1-0-10-0, వరుణ్ చక్రవర్తి 3-0-35-0.

భారత్: అభిషేక్ (సి) సాల్ట్ (బి) టంగ్ 10, వైభవ్ (సి) బట్లర్ (బి) ఆర్చర్ 13, ఇషాన్ (సి) బెథెల్ (బి) టంగ్ 13, శ్రేయాస్ (సి) బెథెల్ (బి) ఆర్చర్ 5, అక్షర్ (సి) బట్లర్ (బి) ఆర్చర్ 10, తిలక్ (స్టంప్డ్) బట్లర్ (బి) జాక్స్ 3, హర్షిత్ (సి) బాంటన్ (బి) టంగ్ 9, దూబే (సి) బట్లర్ (బి) టంగ్ 2, అర్ష్‌దీప్ (సి) బట్లర్ (బి) రషీద్ 4, వరుణ్ (బి) రషీద్ 5, ప్రిన్స్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 11.4 ఓవర్లలో 76 ఆలౌట్; వికెట్ల పతనం: 1-23, 2-29, 3-41, 4-41, 5-52, 6-60, 7-63, 8-68, 9-70, 10-76; బౌలింగ్: ఆర్చర్ 3-0-29-3, టంగ్ 4-0-28-4, జాక్స్ 2-0-5-1, రషీద్ 2.4-0-14-2.

# కన్నీళ్లతో మైదానాన్ని వీడిన రొనాల్డో

## కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ ఆడిన క్రిస్టియానో

రెఫరీ మ్యాచ్ ముగింపు విజిల్ వేయగానే స్పెయిన్ ఆటగాళ్లు పోర్చుగల్ ఆటగాళ్లు మైదానంలోనే కుప్పకూలిపోయారు. తన కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ ఆడుతున్న 41 ఏళ్ల క్రిస్టియానో రొనాల్డో కన్నీళ్లతో మైదానాన్ని వీడటం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లోనే అత్యధిక గోల్స్ చేసిన రొనాల్డోకు, తన దేశానికి ప్రపంచకప్ అందించాలనే కల ఈ ఓటమితో శాశ్వతంగా ముగిసిపోయింది. 2006లో రొనాల్డో ప్రపంచకప్ అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి వరల్డ్ కప్‌లలో రొనాల్డో తనదైన మార్క్‌ను కనబరుస్తూ వస్తున్నాడు. రొనాల్డో తన సుదీర్ఘ కెరీర్‌లో మొత్తం 27 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడి 11 గోల్స్ నమోదు చేశాడు. అతని కెరీర్‌కు తగినట్లుగానే, ప్రపంచకప్ చరిత్రలో అతను చేసిన ఏకైక నాకౌట్-స్టేజ్ గోల్ క్రొయేషియాపై నమోదైంది. ఆ గోల్ ద్వారానే రౌండ్ ఆఫ్ 32లో క్రొయేషియాను ఓడించి పోర్చుగల్ నాకౌట్ ఆశలను రొనాల్డో సజీవంగా ఉంచగలిగాడు. 21 ఏళ్ల వయసులో రొనాల్డో తన మొదటి ప్రపంచకప్ ఆడాడు. ఆ ఏడాది పోర్చుగల్ సెమీఫైనల్స్ వరకు దూసుకెళ్లింది. ఇదే రొనాల్డో కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచకప్ రన్. ఆ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లాండ్‌తో జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో రొనాల్డో అత్యంత ఒత్తిడి మధ్య విజయవంతమైన గోల్ కొట్టి పోర్చుగల్‌ను గెలిపించాడు. ఆ క్షణం పోర్చుగల్ ఫుట్‌బాల్ చరిత్రలో నిలిచిపోయింది. అయితే, ఆ తర్వాత అంతకంటే పెద్ద విజయాలను అందుకోలేకపోయాడు. 2026



ఎడిషన్‌లో 5 మ్యాచ్‌లలో 3 గోల్స్ చేసి రొనాల్డో వ్యక్తిగతంగా మెరుగైన ప్రదర్శనే చేశాడు. రౌండ్ ఆఫ్ 32లో క్రొయేషియాపై పోర్చుగల్ 2-1తో గెలిచిన మ్యాచ్‌లో రొనాల్డో తన కెరీర్‌లోనే మొట్టమొదటి ప్రపంచకప్ నాకౌట్ గోల్ సాధించాడు. దీని ద్వారా 41 సంవత్సరాల 147 రోజు వయసులో గోల్ చేసి, ప్రపంచకప్ నాకౌట్ చరిత్రలోనే 'అత్యంత వృద్ధ గోల్‌స్కోరర్'గా రికార్డు సృష్టించాడు. అలాగే ఆరు విభిన్న ప్రపంచకప్ టోర్నీలలో గోల్స్ చేసిన ప్రపంచంలోనే ఏకైక ఆటగాడిగా నిలిచాడు. ఫుట్‌బాల్ క్రీడలో దాదాపు అన్ని రకాల క్లబ్, వ్యక్తిగత ట్రోఫీలను గెలిచిన క్రిస్టియానో రొనాల్డోకు ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడలేకపోయాడనే అసంతృప్తి ఎప్పటికీ ఉంటుంది. ఆ వెలితితోనే అతను ప్రపంచకప్‌కు వీడ్కోలు పలికాడు. రొనాల్డో అంతర్జాతీయ కెరీర్‌లో చాలా కాలం పాటు పోర్చుగల్ జట్టు భారాన్ని తన భుజాలపైనే మోశాడు. అన్నీ తానై నడిపించాడు. అయితే, ఇటీవల కాలంలో పోర్చుగల్ జట్టులోకి కొత్త తరం ప్రతిభావంతులైన ఆటగాళ్లు రావడం కాస్త ఊరటనిచ్చే విషయం. అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి- పోర్చుగల్ లెజెండ్ రొనాల్డో ఇద్దరూ సమకాలిన ఫుట్‌బాల్ యవనికపై ఒక శకాన్ని శాసించారు. అయితే, ప్రపంచకప్‌లో వీరద్దరూ తలపడితే చూడాలని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కానీ, అది ఒక్కసారి కూడా జరగకుండానే రొనాల్డో వరల్డ్ కప్ ప్రస్థానం ముగిసింది. దీంతో ఈ ఇద్దరి పోరును వరల్డ్ కప్ ఇక చూడలేమని చెప్పాలి. అంతేకాదు, ఈ ఇద్దరిని పోలుస్తూ చర్చ కూడా నడిచింది. నిజానికి ఈ టోర్నీలో మెస్సి, రొనాల్డో ముఖాముఖి తలపడే అవకాశం ఒకటి వచ్చింది. ఒకవేళ గ్రూప్ స్టేజ్‌లో పోర్చుగల్ కొలంబియా కంటే ముందంజలో ఉండి గ్రూప్ టాపర్‌గా నిలిచి ఉంటే, నాకౌట్లలో ఇరు జట్లు గెలుస్తూ వస్తే క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా-పోర్చుగల్ తలపడేవి. ఉజ్బెకిస్తాన్‌పై విజయం తర్వాత రొనాల్డో కూడా దీనిపై స్పందించాడు. అలా జరిగితే చాలా అద్భుతంగా ఉంటుందని అని పేర్కొన్నాడు. లియోనెల్ మెస్సి 2014లో అర్జెంటీనాను ఫైనల్స్ వరకు నడిపించగా, 2022లో ఏకంగా ప్రపంచకప్ ట్రోఫీని గెలిపించి తన కల నెరవేర్చుకున్నాడు. కానీ, రొనాల్డో ప్రయాణం మాత్రం అది నెరవేరకుండానే నిరాశతోనే ముగిసింది.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

## ఇంటింటా ఫీవర్ సర్వేలు, డ్రైడే, యాంటీ లార్వా చర్యలు నిరంతరం చేపట్టాలి: కలెక్టర్ బి. సత్యప్రసాద్




జగిత్యాల, జనతా న్యూస్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ఇంటింటా ఫీవర్ సర్వేలు, యాంటీ లార్వా చర్యలు, డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. తక్కువ వర్షపాతం కారణంగా దోమల ద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటూ, ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో వాస్తవ పరిస్థితులనే నివేదించాలని, తప్పుడు నివేదికలు సమర్పించవద్దని స్పష్టం చేశారు. ప్రతి ఇంటిలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి లార్వా నిర్మూలన చర్యలు చేపట్టాలని, గ్రామం లేదా పట్టణంలో ఒక్క ఇంటిని నిర్లక్ష్యం చేసినా అక్కడి నుంచే వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతిరోజూ కనీసం 30 శాతం గృహాలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య కిట్లు, పరీక్షా సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని, వీధి ఆహార విక్రేతలకు వైద్య పరీక్షలు నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కరపత్రాలు, చెత్త సేకరణ వాహనాల ద్వారా ప్రజల్లో ప్రచారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వైద్యశాఖ అధికారులు జిల్లాలో ఇప్పటివరకు రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, వాటిపై అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టామని తెలిపారు. రాపిడ్ రెస్పాన్స్ బృందాలు, యాంటీ లార్వా చర్యలు, ఫాగింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజగౌడ్, డీఆర్డీఓ రఘువరన్, డీపీఓ మధుసూదన్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, జనతా న్యూస్: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి, తాళ్లధర్మారం, తుంగూరు గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాల వంటగదులు, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సారంగాపూర్ మండలంలోని నాగపుగూడెం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా విస్తృత అవగాహన కల్పించాలని, దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నమోదు ప్రక్రియ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ లక్ష్మణరావు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## రీ-సర్వే, జాతీయ రహదారి భూసేకరణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ బి.ఎస్. లత



జగిత్యాల, జనతా న్యూస్: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్, భూ రీ-సర్వే పనులను, అలాగే కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారి భూసేకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు పత్రాలు పంపిణీ చేస్తున్న తీరు, ఓటర్ల వివరాల నమోదు, అవగాహన కార్యక్రమాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఓటరికి దరఖాస్తు పత్రాలు అందజేసి, సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా స్వీకరించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మన్నపేట గ్రామంలో భూ రీ-సర్వేపై గ్రామసభ నిర్వహించి రైతులకు, గ్రామ ప్రజలకు రీ-సర్వే విధానం, చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు. గ్రామసభల ద్వారా రీ-సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. కోరుట్లలో జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన భూసేకరణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్, పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన భూ యజమానులకు నష్టపరిహారం ఆలస్యం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, భూమి కొలతల సహాయ సంచాలకుడు కిషన్ ప్రసాద్, తహసీల్దార్, ఎంపీడీవో, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ పంచముఖి, శ్రీ రామసాయి దేవాలయ వార్షికోత్సవం

## ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొన్న భక్తులు

కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఉన్న శ్రీ పంచముఖి, శ్రీ రామసాయి దేవాలయం 16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, తిరునగిరి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆయనను సన్మానించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. మాజీ ఎంపీపీ కుంట రాజేందర్, మహాత్మానగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్‌లను కూడా ఆలయ కమిటీ సత్కరించింది. వేడుకలకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షుడు చిందం నరసయ్యతో పాటు గడప శేఖర్, సిరిపురం శ్రీనివాస్, సల్ల రాజయ్య, సల్ల మల్లేశం, సుధాకర్ రెడ్డి, మృత్యుంజయం, బండి కుమార్, బూట్ల కరుణాకర్, కొట్టాల శ్రీనివాస్, చిందం అంజి, చిందం మనోహర్, కొత్తూరి శ్రీనివాస్, సిద్దయ్య, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు ప్రజలు సహకరించాలి: కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



కరీంనగర్, జనతా న్యూస్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి ప్రఫుల్ దేశాయ్ కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని తన నివాసంలో స్వయంగా గణన దరఖాస్తు పత్రాన్ని నింపి సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు అందజేసే గణన పత్రాలను ప్రతి కుటుంబం స్వయంగా పూర్తి చేసి తిరిగి వారికి అందించాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా పూర్తయ్యేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకే ఇంటి నంబరుపై ఉన్న నకిలీ ఓట్లను గుర్తించి తొలగించడం వంటి ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలు బూత్ స్థాయి అధికారులకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రఫుల్ దేశాయ్ సూచించారు.

# ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

**జ్వరాల నివారణ, టీకాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు**



కరీంనగర్, జనతా న్యూస్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు నమోదు పుస్తకం, బాహ్య రోగుల నమోదు, అసాంక్రమిక వ్యాధుల నమోదు, ఔషధ నిల్వలు, టీకాల నిల్వ కేంద్రం, ఉష్ణోగ్రత నమోదులను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశమై ప్రతి గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు కలిసి వారానికోసారి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జ్వరాల సర్వేలు, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రతి శుక్రవారం పరిశుభ్రత దినోత్సవం పాటించడం, జ్వర నమూనాలను క్రమం తప్పకుండా పరీక్షలకు పంపించాలని ఆదేశించారు. వైద్య శిబిరాల వివరాలను ముందుగానే తెలియజేయాలని, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరుల సంరక్షణ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాముకాటు, కుక్కకాటు చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య గుర్తింపు కార్డుల నమోదు పెంచాలని తెలిపారు. 13 ఏళ్లు పైబడిన మహిళలకు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల్లో పరీక్షలు పూర్తిచేసిన వారికి తిరిగి పునఃపరీక్షలు నిర్వహిస్తూ పర్యవేక్షించాలని, 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మధుకర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ దరఖాస్తులు సమర్పించాలి

**49వ డివిజన్ ఓటర్లకు కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ విజ్ఞప్తి**



కరీంనగర్, జనతా న్యూస్: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా 49వ డివిజన్‌కు చెందిన ఓటర్లు గణన దరఖాస్తు పత్రాలను పూర్తిచేసి సమర్పించాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ కోరారు. బూత్ స్థాయి అధికారులు అందజేసిన గణన పత్రంలో 2002 నాటి ఓటరు వివరాలు, తల్లి లేదా తండ్రి వివరాలు, ప్రస్తుత నివాస వివరాలను నమోదు చేసి, ఫొటోను అతికించి సమర్పించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 7, 8 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భాగ్యనగర్ రోడ్ నెం.6లోని సనాతన ధర్మం కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు.

# ఆపరేషన్ ముస్కాన్-12లో విస్తృత తనిఖీలు

**చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన కల్పించిన అధికారులు**



కరీంనగర్, జనతా న్యూస్: ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నగర పరిధిలోని భవన నిర్మాణ ప్రాంతాలు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో చైల్డ్ హెల్ప్‌లైన్--1098 ప్రాజెక్టు సమన్వయకర్త సంపత్, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం బృందంతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు, అక్రమ రవాణాకు గురైన చిన్నారులు ఉన్నారా అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. కార్మికులు, హోటల్ యజమానులు, నిర్వాహకులకు బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు లేదా అక్రమ రవాణాకు గురైన చిన్నారులు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా 100కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే ప్రతి చిన్నారికి రక్షణ కల్పించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది మల్లేశం, సురేందర్ పాల్, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**



కరీంనగర్, జనతా న్యూస్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా సాధారణ సమావేశం జిల్లా అధ్యక్షుడు గందె కొమురయ్య అధ్యక్షతన కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో అవినీతిని అరికట్టి కార్మిక ప్రతినిధులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, సహజ మరణ పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, ప్రసూతి, వివాహ ఆర్థిక సహాయాన్ని రూ.లక్షకు పెంచాలని కోరారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకుడు పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ, ఈ నెల 9న కొన్ని ప్రైవేటు సంఘాలు ఇచ్చిన పనుల బంద్ పిలుపుతో ఏఐటీయూసీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అలాగే ఈ నెల 12న జరిగే ఏఐటీయూసీ జిల్లా మహాసభకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, రేగుల కుమార్, కన్నం సదానందం, కాశీబొసుల సంతోష్‌చారి, గోదారి లక్ష్మణ్, బోయిని రాజయ్య, సుదర్శన్, అండే జంపయ్య, అశోక్, సంపత్, కొమురయ్య, నాగుల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ పథకం కార్యాచరణకు ఆమోదం

**రైతులకు శిక్షణలు, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయం**




కరీంనగర్, జనతా న్యూస్: జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం ఆత్మ నిర్వహణ కమిటీ, జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆత్మ పథకం కింద చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించి కార్యాచరణకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మ పథక సంచాలకులు బి. చత్రు నాయక్ మాట్లాడుతూ జిల్లాకు ఆత్మ పథకం ద్వారా రూ.19.394 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో 60 క్షేత్ర ప్రదర్శనలు, 24 శిక్షణ కార్యక్రమాలు, 8 పొలం బడులు, ఒక రైతు మేళా నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే. వెంకటేశ్వరరావు వరి, పత్తి పంటల్లో నానో ఎరువులు, జీవన ఎరువుల వినియోగం, తడి--పొడి పద్ధతిలో వరి సాగు, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, నాటు కోళ్ల పెంపకంపై క్షేత్ర ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారి తీగజాతి కూరగాయల సాగు, సమగ్ర సస్యరక్షణ, పంట మార్పిడి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి చేపల పెంపకంపై రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి కోరారు. ఈ సమావేశంలో మానకొండూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్, వ్యవసాయ మార్కెటింగ్ అధికారి, ఆత్మ జిల్లా కమిటీ సభ్యులు, ఆత్మ చైర్మన్లు, బీటీఎంలు, ఏటీఎంలు పాల్గొన్నారు.

# సైదాపూర్ కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

**నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**



కరీంనగర్, జనతా న్యూస్: సైదాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో చేపడుతున్న డార్మిటరీ, మరుగుదొడ్లు, వంటగది తదితర నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన ఆమె విద్యార్థులతో కలిసి పాఠాలు విని, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా పురోగతి, వసతి సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య అందిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తూ, సులభమైన బోధన పద్ధతులను అమలు చేయాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఎంపీడీఓ యాదగిరి, ప్రణాళిక సమన్వయకర్త మిల్కూరి శ్రీనివాస్, మండల విద్యాధికారి కట్టా రవీంద్రాచారి, జీసీడీఓ ఉమారాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# జోనల్ స్థాయి పోలీసు విధుల పోటీలకు కరీంనగర్ వేదిక

## వృత్తి నైపుణ్యాలు, శాస్త్రీయ దర్యాప్తు సామర్థ్యాల పెంపుదలకు ప్రత్యేక పోటీలు




కరీంనగర్, జనతా న్యూస్: తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడో జోనల్ స్థాయి పోలీసు విధుల పోటీలు--2026 సోమవారం కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లో ప్రారంభమయ్యాయి. జూలై 7, 8 తేదీల్లో జరిగే ఈ పోటీల్లో కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మొత్తం 91 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నట్లు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై అవగాహన పెంచడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. శాస్త్రీయ దర్యాప్తు, పేలుడు పదార్థాల గుర్తింపు తనిఖీలు, శునక దళం, కంప్యూటర్ పరిజ్ఞానం, ఛాయాగ్రహణం, దృశ్య చిత్రీకరణ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని బహుళ జోన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ప్రకారం బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు అదనపు వేతన పెరుగుదలలు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు అదనపు వేతన పెరుగుదలలు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్షతో పాటు ఒక అదనపు వేతన పెరుగుదల అందజేయనున్నట్లు వెల్లడించారు.

ఈ పోటీలను కేవలం పోటీగా కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావించి, క్రమశిక్షణ, అంకితభావంతో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ, సహాయ పోలీసు కమిషనర్లు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి, ఇతర జిల్లాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# అధిక ధరకు ఎరువుల విక్రయం

## చర్యలు తీసుకోవాలని ఏవోకు రైతుల ఫిర్యాదు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : అధిక ధరకు ఎరువుల బస్తాలనువిక్రయిస్తున్న ఫర్టిలైజర్ నిర్వహకుడి పై కఠిన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగలిపాలెం రైతులు వ్యవసాయ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఆయాన్స్ ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ సీడ్స్‌షాప్ లో ఈ నెల 4న 300 డీఏపీ బస్తాలు తీసుకొచ్చిన నిర్వాహకులు ఒక్కో బస్తా పై 450 రూపాయలు అదనంగా తీసుకున్నట్లు రైతులు ఆరోపించారు. ఒక డిఏపి బస్తాకు రూ.1350 ఉండగా రూ.1800 లకు ఎలా అమ్ముతారని స్థానిక రైతులు మండిపడ్డారు. ఈ ఘటనపై రైతులు తిమ్మాపూర్ ఏవో కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా ఫర్టిలైజర్ నిర్వాహకుడిని వివరణ కోరగా... తాము డిఏపి బస్తాలు అమ్మిన మాట వాస్తవమేనని, కానీ అదనంగా డబ్బులు తీసుకోలేదని అన్నారు. కావాలనే తమపై భురద చల్లేందుకు గ్రామానికి చెందిన కొందరు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇదిలా ఉంటే డీఏపి బస్తాలు తీసుకున్న రైతులు మాత్రం తాము డిఏపీ బస్తాలకే అమౌంట్ ఆన్లైన్ లో కొట్టామని, ఫోన్ పే చేసిన స్క్రీన్ షాట్లను చూపించారు. అధికారులు మాత్రం రైతులకు న్యాయం చేస్తారా లేదా షాప్ నిర్వాహకుడికి అండగా ఉంటారో తేలాల్సి ఉంది. ఏఓ కు ఫిర్యాదు ఇచ్చిన వారిలో పరిపాటి మల్లారెడ్డి, మోరపల్లి మల్లారెడ్డి, మోరపల్లి ఎల్లారెడ్డి, పరిపాటి రవీందర్ రెడ్డి, అలాగే రేకొండా గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉన్నారు.

# శరీరదానానికి కవయిత్రి పద్మావతి అంగీకారం

## వైద్య విద్యార్థుల పరిశోధనల కోసమేనని వెల్లడి

## కాకతీయ మెడికల్ కళాశాలకు సమ్మతి పత్రాల అందజేత



హుస్నాబాద్, జనత న్యూస్: ప్రముఖ కవయిత్రి, సామాజిక సేవకురాలు వనపర్తి పద్మావతి మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలకు శరీరదానం చేసేందుకు సంబంధించిన సమ్మతి పత్రాలను రెడ్‌క్రాస్ సొసైటీ డేకేర్ సెంటర్‌లో కళాశాల అధికారులకు అందజేశారు. ఈ పత్రాలపై ఆమె భర్త, విశ్రాంత తహసీల్దార్ చంద్రశేఖర్, కుమార్తె ప్రజ్వల, కుమారులు ప్రవీణ్, ప్రణీత్ సాక్ష్యులుగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, వరంగల్ మహిళలు, వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కూరాకుల భారతి తదితరులు మాట్లాడారు. మరణానంతరం శరీర, అవయవదానం చేయడం ద్వారా వైద్య విద్యాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. పద్మావతి తీసుకున్న ఈ మహోన్నత నిర్ణయం సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. అనంతరం పలు సామాజిక సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు ఆమెను ఘనంగా సన్మానించారు. శరీరదానానికి ముందుకు వచ్చిన పద్మావతిని తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పోలోజు రాజ్‌కుమార్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు సంగ శ్రీధర్, మహిళా అధ్యక్షురాలు గంటా రజినీ రెడ్డి, కవులు, రచయితలు వేముల తిరుపతిరెడ్డి, పంజాల ఐలయ్య గౌడ్, అడ్లూరి వెంకటేశ్వర్లు, వేములవాడ రాధిక, పెద్దపెల్లి స్పందన, స్వాతి షర్మిల తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు టి. నిర్మల, జె. విజయలక్ష్మి, భారతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుక మహనీయులు మందకృష్ణ

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వద్దూరి పర్శరాములు.



జనత న్యూస్ బెజ్జంకి : ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో సంఘ నాయకులు, మందకృష్ణ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వడ్లూరి పర్శరాములు జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 32 సంవత్సరాలు నుండి రిజర్వేషన్ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో , ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఆటంకాలు ఎదురైనా, రాజ్యాంగబద్ధంగా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, తొలి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ, వర్గీకరణ సాధించిన గొప్ప యోధుడు, సామాజిక సమస్యలపై, రాజకీయ సమస్యలపై, అన్యాయాలపై ప్రశ్నించే గొంతుక మంద కృష్ణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, వార్డు సభ్యులు పొట్లపల్లి శివ, లోనే నర్సింగారావు, తిప్పారపు మహేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చింతకింది పర్శరాములు, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, మంకాల బాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి మోదుంపల్లి రాజు, సలహాదారులు తాడిచెట్టు భూమయ్య, పట్టణ అధ్యక్షులు బోనగిరి చంద్రయ్య, పట్టణ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పొట్లపల్లి లక్ష్మణ్, స్వేరో సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షులు ఉప్పులేటి బాబు, వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు

## రూ.6వేల జరిమానా



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ పురపాలక పరిధిలో సింగిల్ యూజ్ (ఏకకాల వినియోగ) ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వ్యాపార సముదాయాలు, దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడుతున్న ఆరు దుకాణాలను గుర్తించి, వారికి మొత్తం ఆరు వేల రూపాయల జరిమానా విధించారు. ఇందులో భాగంగా మైసూర్ బేకరీకి రూ.1500, రాజస్థాన్ ఆశా పూరి స్వీట్ హౌస్‌కు రూ.1000, ఎస్ఎల్‌వీ బెంగళూరు బేకరీకి రూ.1000 జరిమానా విధించారు. అలాగే రాందేవ్ జనరల్ స్టోర్స్, హనుమాన్ జనరల్ స్టోర్స్‌లకు చెరి రూ.1000 చొప్పున, ఆర్ఎస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ అధికారులు రశీదులు అందజేశారు. ఈ సందర్భంగా సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం మాట్లాడుతూ... పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించినా, వాడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జనపనార, గుడ్డ సంచులను వాడాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇకపై పట్టణంలో తనిఖీలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, జవాన్ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొని, దుకాణాల నుంచి భారీగా నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

# 20 రోజులు గడిచినా బాధితులకు దక్కని న్యాయం!

## - మద్యం మత్తులో ఢీకొట్టి పరారయ్యాడని ఆరోపణ

## - పట్టించుకోని పోలీసులు.. బాధితుల కుటుంబాల ఆవేదన





హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డులో గత నెల జూన్ 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు బాధితులకు 20 రోజులు గడిచినా ఇప్పటికీ న్యాయం జరగలేదని వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్‌లోని కేబీ కాలనీకి చెందిన మంద సది, కోరేపు సంపత్ అనే ఇద్దరు కూలీలు పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, నాగారం రోడ్డులో రాంగ్ రూట్‌లో వచ్చిన కారు (నంబర్ టూ 13 జుచీ 9733) వీరిని బలంగా ఢీకొట్టింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆర్ఎస్ఐ (=ూ×)గా విధులు నిర్వహిస్తున్న హుస్నాబాద్ పట్టణానికి చెందిన ప్రశాంత్ యాదవ్ ఈ కారును నడుపుతున్నట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరి కాళ్లు తీవ్రంగా విరగడంతో తొలుత హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి, ఆపై పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి ప్రస్తుతం అక్కడే చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన మరుసటి రోజే హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు నిందితుడిపై నామమాత్రపు కేసు మాత్రమే నమోదు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయంలో సదరు వ్యక్తి మద్యం మత్తులో ఉన్నాడని, బ్రీత్ అనలైజర్ పరీక్షకు దొరకకూడదనే ఉద్దేశంతోనే ఘటనా స్థలం నుంచి పరారయ్యాడని వారు పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షులు ఉన్నప్పటికీ పోలీసులు తగిన సెక్షన్ల కింద కేసు నమోదు చేయకుండా నిందితుడిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటివరకు అతడిని కస్టడీలోకి కూడా తీసుకోలేదని వారు వాపోయారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి వెళ్లినా, మధ్యవర్తిత్వం చేసిన కొందరు స్థానిక నాయకుల వల్ల తమకు ఎలాంటి న్యాయం జరగలేదని బాధితులు పేర్కొన్నారు. తాము పేద కూలీలము కావడంతోనే కేసును నీరుగార్చుతున్నారని, కూలి పనులే జీవనాధారంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆస్పత్రి పాలుకావడంతో తమ కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అరెస్ట్ చేయాలని, తమకు తగిన న్యాయం చెయ్యాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

# రెండు బైకు లు ఢీకొని ఒక్కరు మృతి



తిమ్మాపూర్, జనతా న్యూస్ రెండు బైకు లు ఢీకొని మృతి చెందిన సంఘటన తిమ్మాపూర్ మండలం అలుగునూర్ లో చోటు చేసుకుంది.. వేములవాడ నుంచి హుజురాబాద్ కి బైకు పై వెళ్తున్న తాళ్లపల్లి రాజేందర్ కి ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొట్టింది. బైకులు రోడ్డుపై పడిపోగా వెనుక నుండి వచ్చిన లారీ రాజేందర్ పై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిచెందిన రాజేందర్ హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం చెందినట్లు ఎల్ఎండీ పోలీసులు గుర్తించారు. పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

# లక్ష్మీపూర్ లో ఓటర్ సవరణ ను పరిశీలించిన తహసిల్దార్



జనత న్యూస్ బెజ్జంకి : కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా చేపట్టిన ఓటర్ సవరణ ( ఎస్. ఐ.ఆర్ ) కార్యక్రమాన్ని మండల తహసిల్దార్ కె. శ్రీకాంత్ మంగళవారం లక్ష్మీపూర్ లో పరిశీలించి బి. ఎల్.ఓ లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ( ఎస్ ఐ ఆర్ ) ప్రత్యేక ఓటర్ సవరణ అంటే , “వడపోత” కార్యక్రమమని, భారత రాజ్యాంగం ప్రకారం ఒక పౌరుడికి ఒకే ఓటు ఉండాలనే, కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఓటరు విధిగా తమకు ఇచ్చిన ఫారాలను నియమాలకు అనుగుణంగా నింపి జూలై 15 లోపు బి.ఎల్. ఓ లకు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత రత్నాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ గంగాధర హరీష్, డిప్యూటీ తహసిల్దార్ ఆసియా రఫాత్, జిపిఓ రాజశేఖర్, టైపిస్టు రమేష్, ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు లింగాల అర్జున్, బోనగిరి మహేష్, బి ఎల్ ఓ లు, వివో ఏ లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం

**ఐదు ట్రాక్టర్లు, రెండు అక్రమ ఇసుక డంపులు స్వాధీనం..**

**చర్యలు కొనసాగుతాయన్న సీపీ గౌష్ ఆలం**





కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు ముమ్మరం చేశారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో ఐదు ట్రాక్టర్లు, రెండు అక్రమ ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామ పరిసరాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న పెద్దపల్లి జిల్లాకు చెందిన మూడు ట్రాక్టర్లను గుర్తించి స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అదేవిధంగా మానేరు వాగులో కోతిరాంపూర్‌కు చెందిన ఒక ట్రాక్టర్ అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అప్పగించారు. నెడునూరు గ్రామ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో రెండు అక్రమ ఇసుక డంపులను గుర్తించారు. ఒక డంపులో సుమారు 25 ట్రిప్పులు, మరొక డంపులో 10 ట్రిప్పుల ఇసుక నిల్వ చేసినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న మరో ట్రాక్టర్‌ను కూడా స్వాధీనం చేసుకుని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అక్రమ ఇసుక తవ్వకం, రవాణా, నిల్వలపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు. అక్రమ ఇసుక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలను కోరారు.

# మహిళపై దాడి చేసి చైన్ స్నాచింగ్‌కు యత్నించిన నిందితుడు అరెస్ట్

**ఘటన స్థలంలో వదిలిన సెల్‌ఫోన్, సైకిల్ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు**



కరీంనగర్, జనతా న్యూస్: చల్లూరు గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి బంగారు పుస్తెల తాడును అపహరించేందుకు యత్నించిన నిందితుడిని వీణవంక పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది. పోలీసుల కథనం ప్రకారం, చల్లూరు గ్రామానికి చెందిన వేముల పద్మ (45) ఈ నెల 6వ తేదీ సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉండగా, దొంగతనం చేయాలనే ఉద్దేశంతో ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కొనే ప్రయత్నంలో బాధితురాలిపై దాడి చేసి ముఖం, కడుపుపై గాయపరిచాడు. బాధితురాలి కేకలు విని కుమార్తె శాముల నవ్యశ్రీ, బంధువు శాముల సంపత్ అక్కడికి చేరుకోవడంతో నిందితుడు భయపడి తాను తీసుకొచ్చిన సైకిల్, సెల్‌ఫోన్‌ను అక్కడే వదిలి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వీణవంక పోలీసులు, ఘటన స్థలంలో లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా నిందితుడు వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన పిల్లి సదయ్య (45)గా గుర్తించారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు. మహిళలు అపరిచితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

**ఆక్రమణదారులపై కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ హైమావతి**



సిద్దిపేట, జనతా న్యూస్: ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కొండపాక మండలం విశ్వనాథ్‌పల్లి, చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్, కొమురవెల్లి మండలంలోని ప్రభుత్వ భూములను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాలని సూచించారు. ప్రభుత్వ భూమి ఎంత ఉంది, ఎంత మేర ఆక్రమణకు గురైందనే పూర్తి వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములకు పకడ్బందీగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, అక్రమ కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుకు భవన నిర్మాణాల కోసం ప్రభుత్వ భూములు ఎంతో అవసరమని, అందువల్ల వాటి పరిరక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసుల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**జూలై 12 వరకు దరఖాస్తులకు అవకాశం: జిల్లా కలెక్టర్ హైమావతి**

సిద్దిపేట, జనతా న్యూస్: హైదరాబాద్‌లోని తెలంగాణ ఎస్సీ అధ్యయన కేంద్రంలో సివిల్ సర్వీసుల పరీక్షలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 12లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సివిల్ సర్వీసుల ప్రాథమిక, ప్రధాన పరీక్షలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. వార్షిక కుటుంబ ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు జూలై 19న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన ప్రతిభావంతులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. దరఖాస్తులను tsstudycircle.co.in ద్వారా సమర్పించవచ్చని, మరిన్ని వివరాలకు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# వీధిదీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

**విద్యుత్ బిల్లుల తగ్గింపు, పార్కుల ఆధునికీకరణపై అధికారులకు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాలు**




కరీంనగర్, జనతా న్యూస్: నగరంలో వీధిదీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజినీరింగ్, విద్యుత్ విభాగాల అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో వీధిదీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల తగ్గింపు, విద్యుత్ సామర్థ్య నియంత్రణ, వీధిదీపాల ఆన్–ఆఫ్ సమయాలు, ప్రధాన కూడళ్లు, డివిజన్లలోని పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో కొత్తగా నిర్మించిన సమీకృత ఆదేశ, నియంత్రణ కేంద్రం, పద్మానగర్ కూరగాయలు––మాంసం మార్కెట్, ఇతర పార్కుల వద్ద విద్యుత్ వినియోగాన్ని సమీక్షించి బిల్లుల భారం తగ్గించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డివిజన్ల వారీగా వీధిదీపాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడ లైట్లు పనిచేయకపోయినా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పగటి వేళల్లో వీధిదీపాలు వెలగకుండా, సాయంత్రం సరైన సమయానికి వెలిగేలా స్వయంచాలక సమయ నియంత్రణ పరికరాలను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. నగరంలో పాత విద్యుత్ స్తంభాలను గుర్తించి విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని తొలగించే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రధాన కూడళ్లు, పార్కుల్లో లైటింగ్, పచ్చదనం, నీటిచిమ్మే ఫౌంటెన్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ఆధునికీకరణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే సిమెంట్ రహదారుల నిర్మాణానికి ముందు తాగునీటి పైప్‌లైన్ అవసరాలను పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు ఆయాజ్, సువార్త, ఉప కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణు, ఇన్‌చార్జి కార్యనిర్వాహక ఇంజినీర్ లచ్చిరెడ్డి, సహాయ ఇంజినీర్లు, విద్యుత్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**నిర్దేశిత గడువులోగా క్షేత్రస్థాయి పరిశీలన, వివరాల నమోదు పూర్తి చేయాలి: కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



కరీంనగర్, జనతా న్యూస్: నగర వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆర్డీవో శర్మిల, రెవెన్యూ అధికారులతో కలిసి బూత్ స్థాయి పర్యవేక్షకులు, పర్యవేక్షణ అధికారులు, నిర్వహణ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్‌ల వారీగా సర్వే పురోగతి, గణన పత్రాల పంపిణీ, సేకరణ, క్షేత్రస్థాయి పరిశీలన, ఓటర్ల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా గణన పత్రాల పంపిణీ, సేకరణను పూర్తి చేయాలన్నారు. సేకరించిన గణన పత్రాల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి బూత్ స్థాయి అధికారి రోజుకు కనీసం 10 గణన పత్రాల వివరాలను నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణ అధికారులు ప్రతిరోజూ పురోగతి నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఆయాజ్, ఉప కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, తహసీల్దార్లు రాజేష్, వెంకటలక్ష్మి, నర్సింహారావు, ఎన్నికల విభాగం అధికారులు, బూత్ స్థాయి పర్యవేక్షకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com